చుట్టూ చేరినవారిలో ఎక్కువమంది పామునూ, దాని ఆటనూ చూసేందుకే నిలబడ్డారు. సింగన్న బుట్టమీద మూత వేసీవెయ్యగానే, అందులో నలుగురైదుగురు తమ దారిన తాము వెళ్ళిపోయారు. మిగిలినవారు మళ్ళీ పాము నెప్పుడు తీస్తాడా అని కాచుకుని ఉన్నారు. ఒక్కరుకూడా బేడ డబ్బులు యిచ్చి ఆ వేరుముక్కను కొన్నపాపాన పోలేదు...

సింగన్నమాత్రం తన దగ్గరఉన్న వేరు మహాత్మ్యాన్ని పెద్ద గొంతుకతో చాటుకుంటూనేవున్నాడు. మళ్ళీ అయిదు నిముషాలలో మరికొంతమంది జనంవచ్చి చేరారు. నలుగురైదుగురు పిల్లలు పాము బుట్టమీద మూత ఎప్పుడుతీస్తాడా అని ఆత్రంగా ఎదురు చూస్తున్నారు.

అతడు మళ్ళీ బుట్టమీది మూతతీసి, తన వేరు గొప్పదనాన్ని సోపపత్తికంగా నిరూపించడం ప్రారంభించాడు... ఈ సారి అక్కడ చేరిన పది, పదిహేను మందిలోనూ యిద్దరు-ముగ్గురు జేబులు కొట్టేవారున్నారు. జనంఅంతా భయంకరంగా ఆడుతున్న పామువంకా, సింగన్న చేతిలోవున్న వేరు వంకా శ్రద్ధగా చూస్తూఉంటే, వారుమాత్రం పక్కవారి ముఖాలనూ, వారి జేబులనూ చూస్తున్నారు.

మళ్ళీ సింగన్న పాము బుట్టమీద మూత వెయ్యగానే వారిలో కొందరు తమ పనులమీద తాము వెళ్ళేందుకు వెనుదిరిగారు... పిల్లలుమాత్రం బడికి వేళ అవుతున్నా, కదలకుండా మళ్లీ చూసేందుకోసమని అలాగే నిలబడిఉన్నారు. ఇంతలో ఏం జరిగిందో తెలియదు; వెనుదిరిగిన వారిలో ఒకా

